ప్రజాశక్తి

బుధవారం 4 జనవరి 2023 5 విజయనగరం



8న గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్ష

ప్రజాశక్తి-విజయనగరం

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా గ్రూప్ 1 స్క్రీనింగ్ పరీక్షను ఈనెల 8 న నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.సూర్య కుమారి తెలిపారు. పరీక్షను విజయనగరంలో 13 కేంద్రాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 8న ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా నిర్వహించే ఈ పరీక్షకు 5530 మంది అభ్యర్థులను కేటాయించినట్లు తెలిపారు. సక్రమ నిర్వహణ కోసం ప్రతి కేంద్రానికి సీనియర్ అధికారులను లైజన్ అధికారులుగా నియమించామని, వీరంతా ఆయా కేంద్రాలను తనిఖీ చేస్తారని తెలిపారు. కేంద్రం వద్ద 144 సెక్షన్ కు అవసరమగు సిబ్బందిని ఏర్పాటు చేయాలని పోలీస్‌శాఖను ఆదేశించారు. సెంటర్ లో డైరెక్షన్ బోర్డ్ లను ఏర్పాటు చేయాలని చీఫ్ సూపరింటెండెంట్ లకు ఆదేశించారు. నిరంతర విద్యుత్తు, అత్యవసర వైద్యాన్ని అందించే మెడికల్ కాంప్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ గణపతి రావు, లైజన్ అధికారులు పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు ఆపే ప్రసక్తే లేదు

- పింఛన్ల వారోత్సవాల సభలో మంత్రి బొత్స సత్యనారాయణ
- సుజల స్రవంతికి జిల్లా ప్రజలు సహకరించాలి : జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి-గంట్యాడ

పేద వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల అమలుకు అర్హతే ప్రామాణికమని ఇందులో ఎలాంటి సందేహాలకు తావులేదని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పునరుద్ఘాటించారు. అర్హులకు సంక్షేమ పథకాలు ఆపే ప్రసక్తే లేదని, అర్హతల పునఃపరిశీలన నిమిత్తం జారీ చేసే నోటీసులపై కొంతమంది గిట్టని వారు తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ల మొత్తాన్ని పెంచిన నేపథ్యంలో పింఛన్ల వారోత్సవాలను కొటారుబిల్లి వేదికగా మంత్రి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో మూడు దఫాలు పింఛన్ల మొత్తాన్ని పెంచామని మంత్రి పేర్కొన్నారు. ఇప్పుడు రూ.2,750 ఉన్న పింఛను వచ్చే ఏడాది నాటికి రూ.3వేలుకు పెంచి తీరుతామని ఉద్ఘాటించారు. పథకాలు తీసుకునేందుకు ప్రజలు గతంలో ఎన్నో ప్రయాసలు పడేవారని ఇప్పుడా పరిస్థితి లేదని పేర్కొన్నారు. సామాన్యులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా స్థానిక సచివాలయాలను అందుబాటులోకి తీసుకొచ్చామని గుర్తు చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చిన రోజు జిల్లాలో 2.28 లక్షల మంది లబ్ధిదారులు ఉండగా.. నేడు ఆ సంఖ్య 2.83 లక్షలకు చేరిందని పేర్కొన్నారు. పథకాల అర్హతకు సంబంధించి పునఃపరిశీలన చేసే నిమిత్తం జిల్లాలో 4వేల మందికి నోటీసులు ఇస్తే 736 మంది సరైన ధ్రువపత్రాలు సమర్పించలేకపోయారని, మరొక 1,236 మంది తాలూక అర్హతలను పరిశీలించాల్సి ఉందని మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు.

స్థానిక ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. గడప గడపకు కార్యక్రమంలో భాగంగా తన దష్టికి వచ్చిన ప్రతి సమస్యనూ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జెడ్‌పి చైర్మన్ మజ్జిశ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా ప్రజల సాగునీటి అవసరాలను తీర్చేందుకు ఉద్దేశించిన ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గంట్యాడ మండలం పూర్తిగా వర్షాధార ప్రాంతమని కావున ప్రజలు మంచి మనసుతో ఆలోచించి సహకరించాలని కోరారు. కలెక్టర్ సూర్యకుమారి మాట్లాడుతూ నోటీసులిచ్చినంత మాత్రాన పింఛన్లు తొలగించినట్లు కాదని స్పష్టం చేశారు. అర్హతలను నిరూపించుకుంటే యథావిధిగా ఆర్థిక ప్రయోజనాలను అందిస్తామని పేర్కొన్నారు. సాంకేతిక కారణాలతో అక్కడక్కడ ఏర్పడిన ఇబ్బందులను తొలగించి అర్హతున్న ప్రతి ఒక్కరికీ పథకాలను వర్తింపజేస్తామని వివరించారు. అనంతరం పలువురి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురేశ్ బాబు, డిఆర్‌డిఎ పీడీ కల్యాణ చక్రవర్తి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, అధిక సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.



వారోత్సవ సభలో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

సామాజిక విప్లవకారిణి సావిత్రీబాయి పూలే

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సామాజిక విప్లవకారిణి సావిత్రీబాయి పూలే అని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి అన్నారు. చదువుల తల్లి సావిత్రీబాయి పూలే 192వ జయంతి సందర్భంగా స్థానిక సత్య డిగ్రీ కళాశాలలో మంగళవారం సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభావతి మాట్లాడుతూ దేశంలో స్త్రీ విద్యకు పునాది వేసి ఎంతోమందికి వెలుగు దారిని చూపించారని అన్నారు. అప్పటి ఆచార సాంప్రదాయాలకు, మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాడారని, అదే స్ఫూర్తితో సమాజంలో మహిళలు తమ సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. వన్‌టౌన్ సిఐ వెంకటరావు మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలను మహిళలు ధైర్యంగా ఎదుర్కోవాలని, అందుకు తగ్గ శక్తి సామర్థ్యాలు పెంచుకోవాలని సూచించారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్ పావని మాట్లాడుతూ మహనీయుల బాటలో నడవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్షులు వెంకటేష్, సహాయ కార్యదర్శి సిహెచ్ రామకృష్ణ, పట్టణ కార్యదర్శి పి. రమేష్, టౌన్ గర్ల్స్ కన్వీనర్ ఎస్.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని రక్షించుకుందాం

గజపతినగరం : సావిత్రిబాయి పూలేస్ఫూర్తితో ప్రభుత్వ విద్యా రంగాన్ని రక్షించుకుందామని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో సావిత్రి భాయి పూలే జయంతి సభ మంగళవారం నిర్వహించారు. తొలుత సావిత్రి భాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సభలో విజయగౌరి మాట్లాడుతూ .దేశంలో తొలి మహిళా టీచర్ అయి బాలికల చదువు కోసం 58 పాఠశాలలు ఏర్పాటు చేశారని తెలిపారు. అనేక అవమానాలను ఎదుర్కొని పట్టుదలతో పనిచేసిన సామాజిక ఉద్యమ కారిణి అని అన్నారు. సామాజిక దురాచారాలను రూపుమాపడంలో ప్రజలను చైతన్య పరిచిన గొప్ప శక్తి అని అన్నారు. నూతన ఆర్థిక విధానాల ను అమలు చేస్తున్న ప్రభుత్వాలు విద్యారంగంలో వ్యాపారీకరణను ప్రోత్సహించడంతో సంస్కరణల జోరు నేడు నూతన జాతీయ విద్యావిధానం పేరు తో అమలు చేస్తున్నారని, ఇది భవిష్యత్తులో పెనుప్రమాదానికి దారితీస్తుందని అన్నారు. కేంద్రప్రభుత్వం సావిత్రి భాయి పూలే జయంతి రోజున జాతీయ మహిళా టీచర్ల దినోత్సవంగా ప్రకటించాలని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు అల్లు శంకర్రావు, ఉపాధ్యాయులు శ్రీదేవి, గౌరి, లత, విద్యార్థినులు పాల్గొన్నారు.



సావిత్రీబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు



సదస్సులో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి

సావిత్రీబాయిపూలే ఆశయసాధనకు కృషి

విజయనగరంటౌన్ : దేశ తొలి ఉపాధ్యాయరాలు, అణగారిన ప్రజల కోసం జీవితాంతం కృషి చేసిన సావిత్రి భాయి పూలే ఆశయసాధనకు కృషి చేయాలని సిపిఎం నాయకులు రెడ్డిశంకర్రావు అన్నారు. కోట వద్ద ఏర్పాటు చేసిన జయంతి సభలో సావిత్రీ బాయి పూలే చిత్ర పటానికి రెడ్డి శంకరరావు పూలమాల వేసారు, ఆనంతరం మాట్లాడుతూ మహిళలకు విద్యను అందించడంతో పాటు అనేక రకాల మహిళా వివక్షతకు వ్యతిరేకంగా పోరాడారని ఆన్నారు. దళితులు, బలహీన వర్గాల మహిళా ల్లో చైతన్యం తెచ్చారని అన్నారు.కార్య క్రమం లో స్థానిక సిపిఎం నాయకులు పాల్గొన్నారు..

రుణ ప్రణాళికల ప్రతిపాదనలపై జెసి సమీక్ష

ప్రజాశక్తి-విజయనగరం

సామాన్య ప్రజలు, రైతుల ఆర్థిక అవసరాలను తీర్చే విధంగా రూపొందించే రుణ ప్రణాళికలకు సంబంధించిన ప్రతిపాదనలపై జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ వివిధ విభాగాల అధికారులతో కలెక్టరేట్‌లో మంగళవారం సమీక్ష నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రణాళికలు రూపొందించాలని జెసి ఈ సందర్భంగా అధికారులను, బ్యాంకుల ప్రతినిధులను ఆదేశించారు. జిల్లా స్థాయి టెక్నికల్ కమిటీ సభ్యులందరూ హాజరై వివిధ ప్రాజెక్టులకు అందించే రుణాల గురించి, సంబంధిత ప్రతిపాదనల గురించి జేసీకి వివరించారు. సమావేశంలో ఎల్‌డిఎం శ్రీనివాసరావు, డిసిసిబి డిజిఎం వాసు, వ్యవసాయ, మత్స్య, పశుసంవర్థక శాఖల అధికారులు, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.



కలలను సాకారం చేసుకోవాలి : సిటియు విసి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరచుకొని నిర్విరామ కృషితో వాటిని సాకారం చేసుకోవాలని సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ టివి కట్టిమని తెలిపారు. యూనివర్సిటీ లో మంగళవారం 'రోడ్ టు సక్సెస్ కెరీర్ గైడెన్స్ అండ్ స్ట్రాటిజిస్ అనే అంశం పై విద్యార్థులకు అధ్యాపకులకు వర్కుషాపు నిర్వహించారు. అధ్యక్షునిగా విచ్చేసిన విసి కట్టిమని మాట్లాడుతూ మంచి దృక్పథాన్ని కలిగి ఉండి అనుక్షణం దాని కోసం ప్రయత్నం చేసి అవరోధాలను అధిగమిస్తే తప్పకుండా విజేతలు అవుతారని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బొంతు కోటయ్య, డాక్టర్ పి. ఎస్.లత, డాక్టర్ కుసుమ పాల్గొన్నారు.

సామాజిక విప్లవకారిణి సావిత్రీబాయి పూలే

విజయనగరం టౌన్ : జాతీయ బిసి సంక్షేమ సంఘం కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు గదుల వెంకట్రావు మాట్లాడుతూ సమ సమాజ స్థాపన కోసం నిరంతరం పోరాటం చేసిన యోధురాలు అని అన్నారు. విద్యావ్యాప్త కోసం, మహిళా వికాసం కోసం, కుల వివక్షత కోసం నిరంతరం పోరాటం చేసిన సావిత్రిబాయి పూలే సమాజానికి ఆదర్శ మహిళని కొనియాడారు. అనాథల కోసం, అభాగ్యుల కోసం, అన్నార్తుల కోసం శరణాలయాలు ఏర్పాటు చేసి ఆదుకున్న పుణ్యమూర్తి సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి అప్పారావు, చోడి ఆదినారాయణ, ఉపాధ్యక్షులు రామేశ్వర్ రామారావు, మలిచర్ల దుర్గారావు, కార్యదర్శి ఎస్ఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరుగుతున్న సిఐటియు 16వ రాష్ట్ర మహాసభలో నివేదికపై చర్చిస్తున్న సిఐటియు విజయనగరం జిల్లా ప్రతినిధులు

- ప్రజాశక్తి, భీమవరం

పారిశుధ్య పనుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలోని పూల్ బాగ్, కుమ్మరివీధి శానిటేషన్ సెక్రటరీలు పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించడంతో మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం కోటి చెరువు గట్టు, కరెంట్ ఆఫీసు, పూల్‌బాగ్, ఎరుకుల వీధి ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. పారిశుధ్యం అధ్వాన్నంగా ఉండడంతో కమిషనర్ శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్యాన్ని మెరుగుపరుచు కోవాలని హెచ్చరించినా శానిటేషన్ సెక్రటరీల పనితీరులో మెరుగుపడకపోవడంతో కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరు సెక్రెటరీల వేతనాలలో వారం రోజులు కోత విధించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనుపమను ఆదేశించారు. పూల్ బాగ్ రోడ్డులో తాగునీటి పైపులైన్ లీకులను నివారించాలని కోరారు. ఎలక్ట్రికల్ ఆఫీస్ వద్ద పైపులైను లీకై రోడ్డు పైన నీరు పోవటం గమనించి వెంటనే మరమ్మతులు చేయాలని అసిస్టెంట్ ఇంజనీర్‌కి ఆదేశించారు. పూల్‌బాగ్, కొత్త ఎరుకుల వీధి ఏరియాలలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంతో పూల్ బాగ్, కుమ్మరి వీధి సచివాలయాల వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీలకు వారం రోజులపాటు జీతం నిలుపుదల చేయాలని ఆదేశించారు. పర్యవేక్షణ లోపించినందున శానిటరీ ఇన్‌స్పెక్టర్, పర్యావరణ ఇంజనీర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలన్నారు. గొల్లపల్లి బైపాస్ రోడ్‌లో చెత్తల నుండి స్క్రాప్ ఏరుకునే వ్యక్తులను గుర్తించి ఒక సొసైటీగా ఏర్పాటు చేయాలని సూచించారు.

దిగొచ్చిన విద్యుత్‌శాఖ అధికారులు

ఎరుకలపాకలో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫీజులు వేసిన సిబ్బంది

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి- బాడంగి

మతం మారలేదని ఎరుకలపాక గ్రామస్తులను తీవ్ర ఇబ్బందులుపెట్టిన విద్యుత్తుశాఖ అధికారులు ఎట్టకేలకు దిగొచ్చారు. ఇటీవల ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనాలకు, సిపిఎం నాయకుల ఫిర్యాదుతో విద్యుత్తుశాఖ ఉన్నతాధికారులు, పోలీసులు స్పందించి విద్యుత్‌శాఖ సిబ్బందిని హెచ్చరించారు. ఇటీవల సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, నాయకులు పి.శంకర్రావు తదితరులు గ్రామాన్ని సందర్శించి ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. విద్యుత్‌శాఖ సిబ్బంది చేస్తున్న అరాచకాలను గ్రామస్తులు వివరించారు. దీంతో వారిపై చర్య తీసుకోవాలని సిపిఎం నాయకులు విద్యుత్‌శాఖ ఎస్ఇకి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ జయంతి స్పందించి బొబ్బిలి డివిజన్ ఎలక్ట్రికల్ అధికారులు, ఎరుకలపాకల గ్రామ పెద్దలు, ఎంపిటిసి పాలవలస గౌరుతో మంగళవారం సమావేశమయ్యారు. బొబ్బిలి నుండి వచ్చిన డిఇ, ఎడిఇ ఉన్నతాధికారులు కోర్టు కేసులో ఉన్న 2 మీటర్లు మినహాయించి మిగతా వాటికి తక్షణమే విద్యుత్ కలెక్షన్ ఇవ్వడంతో పాటు కోళ్ల ఫారానికి కేటగిరి-2 పెట్టుకోమని చెప్పారు. డైరెక్ట్ చేసిన ట్రాన్స్‌ఫార్మర్ కనెక్షన్ తప్పించి సమస్యను పరిష్కరించారు.దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

అసలు నిందితుడు ఎందుకు రాలేదు..?

మతం మార్పిడి ప్రయత్నం చేసిన అధికారి జయరాం సమావేశానికి ఎందుకు రాలేదని సిపిఎం నాయకులు తమ్మినేని సూర్యనారాయణ ప్రశ్నించారు. తక్షణమే మత మార్పిడికి పాల్పడిన ఆయనను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

వాసవి క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

వాసవి క్లబ్ చేస్తున్న సేవలు నిరుపమానమని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. మంగళవారం నగరంలోని ఉల్లి వీధి ఆర్యవైశ్య భవనంలో జరిగిన వాసవి క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్లబ్బు ఖ్యాతిని మరింత ఇనుమడింప చేసే విధంగా కృషి చేయాలన్నారు. క్లబ్ ద్వారా మరిన్ని ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టి స్ఫూర్తిదాయకంగా నిలవాలని అన్నారు. మహిళలకు కుట్టు శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు లభించే విధంగా చూడాలని అన్నారు. క్లబ్బు జిల్లా గవర్నర్ ఆత్మకూరు సతీష్, వి. జగన్మోహన్‌రావు రావు, జిల్లా వైస్ గవర్నర్ ఆలవెల్లి వెంకట శేఖర్ తదితరులు మాట్లాడారు. నూతన క్లబ్ అధ్యక్షునిగా కందుల సంతోష్, కార్యదర్శిగా సముద్రాల నాగరాజు, కోశాధికారిగా ఎవిఎస్ కుమార్ , ఇతర నూతన క్లబ్ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

ఎంఆర్ కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

విద్యాశాఖ మంత్రి బొత్సకు ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎంఆర్ కాలేజీ లో చదువుతున్న విద్యార్థులపై బెదిరింపులకు పాల్పడుతున్న ఎంఆర్ కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ వెంకటేష్, పి.రామ్మోహన్ నాయకులు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణను కోరారు. మంగళవారం మంత్రి బొత్స సత్యనారాయణను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలేజీ లో చదువుతున్న విద్యార్థులు సమస్యలపైన యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయాలని కోరితే విద్యార్థులను బెదిరించడం ,అంగీకార పత్రం రాయించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని, సొంత భవనాలు ఏర్పాటు చేసి,మౌలిక సదుపాయాలు కల్పించాలని మంత్రిని కోరారు. జిల్లాలో విద్యా రంగంలో ఉన్న సమస్యలను మంత్రికి తెలిపారు. సమస్యలు కేబినెట్ సమావేశంలో చర్చించి పరిష్కారం చేసేందుకు కృషి చేస్తామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాము, రామకృష్ణ, సతీష్ దేవ్ సింగ్, సౌమ్య నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-బొండపల్లి

జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పక్కాగా చర్యలు తీసుకోవాలని వివిధ శాఖాధికారులను కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకొనే గొట్లాం వద్ద బ్లాక్ స్పాట్‌ను, తీసుకున్న భద్రతా చర్యలను కలెక్టర్ సూర్యకుమారి మంగళవారం ఉదయం పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన రంబెల్ స్ట్రిప్స్, వాహనాల వేగ నియంత్రణకు సరిపోవని అభిప్రాయపడ్డారు. వాటితో బాటుగా, అదే ప్రాంతంలో స్పీడ్‌గన్ ఏర్పాటు చేసి, వేగంగా వెళ్తున్న వాహనాలకు జరిమానా విధించాలని ఆదేశించారు. అలాగే తరచుగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలవద్ద హెచ్చరికగా, ప్రమాదానికి గురైన వాహనాన్ని ప్రదర్శనకు ఉంచాలని సూచించారు. డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ డాక్టర్ వి.సుందర్ మాట్లాడుతూ, జిల్లాలో గొట్లాం, బొండపల్లి, కింతలపాలెం, పూల్‌బాగ్, సారిపల్లి, గుర్ల, అచ్యుతాపురం, గరివిడి వద్ద ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నందున స్పీడ్ బ్రేకర్లు, రంబెల్ స్ట్రిప్స్, లాడ్వా, ట్రాఫిక్ సేఫ్టీ కోన్స్ తదితర పరికరాలను ఏర్పాటు చేసి, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా పాఠశాలలు, ఇతర రద్దీ ప్రాంతాల వద్ద వేగ నియంత్రణకు ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించినట్లు డిటిసి వివరించారు. కార్యక్రమంలో ఆర్అండ్ బి ఇఇ జివి రమణ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్స్ ఎవి రమణ, రవిశంకర ప్రసాద్, ఐఆర్‌ఎడి జిల్లా మేనేజర్ ఎం.శ్రీధర్, జాతీయ రహదారుల డిఇ కెవిఎల్ నర్సింహరావు, ఎఇ సురేష్, బొండపల్లి తహశీల్దార్ మిశ్రా, ఎంపిడిఒ వేదవతి పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

మహిళా లోకానికి దిక్సూచి సావిత్రీబాయి పూలే

రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ • పూలే జంక్షన్ వద్ద సావిత్రీబాయి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

స్త్రీ విద్యకోసం కృషి చేసిన సావిత్రి బాయి పూలే, మహిళా లోకానికి దిక్సూచి వంటివారని రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ కొనియాడారు. కలెక్టరేట్ సమీపంలోని మహాత్మా జ్యోతిభా పూలే విగ్రహం పక్కన ఏర్పాటు చేసిన సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని మంగళవారం సాయంత్రం ఆవిష్కరించారు. వాటర్ ఫౌంటెన్‌ను ప్రారంభించారు. సుమారు రూ.43.75 లక్షల ఖర్చుతో మున్సిపల్ కార్పొరేషన్ ఈ కూడలిని అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దింది. ఈ సందర్భంగా మంత్రి బొత్స మాట్లాడుతూ, మహాత్మా జ్యోతిభా పూలే, అతని భార్య సావిత్రిబాయి పూలే గొప్ప సంఘ సంస్కర్తలని కొనియాడారు. మహిళలకు విద్య చెప్పించాలన్న గొప్ప ఆశయంతో, జ్యోతిభా పూలే తన భార్యను ఆనాడే, దేశంలోనే మొట్టమొదటి ఉపాధ్యాయురాలిగా తీర్చి దిద్దారని అన్నారు. ఇప్పటికీ కొన్ని దేశాల్లో తాలిబాన్లు స్త్రీవిద్యను వ్యతిరేకిస్తున్నారని, కానీ ఆనాడే మహిళలను అక్షరాస్యులను చేసి, సమాజ సంస్కరణను సావిత్రిబాయి పాటుపడ్డారని చెప్పారు. బిసిలు గర్వంగా తలెత్తుకొని తిరిగేలా, పూలే దంపతుల కీర్తి శాశ్వతంగా నిలిచి ఉంటుందన్నారు. పూలే దంపతుల సామాజిక సేవ, సేవాతత్పరత ప్రతీఒక్కరికీ ఆదర్శం కావాలని పిలుపునిచ్చారు.

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ సావిత్రిబాయి మార్గదర్శకంలో ప్రతి ఒక్కరూ నడవాల్సిన అవసరం ఉందన్నారు. దశలవారీగా అన్ని కూడళ్లను అభివద్ధి చేయనున్నట్లు చెప్పారు. జ్యోతిబా పూలే విగ్రహం ఉన్న ప్రాంతానికి పూలే జంక్షన్‌గా నామకరణం చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎ.సూర్యకుమారి, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ, సావిత్రిబాయి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా బిసిల చిరకాల కోరిక నెరవేరిందని అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ ఎ.సూర్యకుమారి, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు ఇసరపు రేవతీదేవి, కోలగట్ల శ్రావణి, డిసిసిబి ఛైర్మన్ వేచలపు చినరామునాయుడు, మాజీ ఎంఎల్‌సి గాదె శ్రీనువాసులనాయుడు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, ముద్దాడ మధు, ఆశపు వేణు, సూర్యనారాయణ రాజు తదితర నాయకులు, బిసి సంఘాల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



సావిత్రీబాయి పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్

రైతు భరోసా కేంద్రం సందర్శన

నెల్లిమర్ల : మొయిద రైతు భరోసా కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు రెడ్డి అన్నపూర్ణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె రాగి, అపరాలు, మొక్కజొన్న పంటలను పరిశీలించి రాగిలో అగ్గి తెగులుకు ట్రైసైక్లోజోలు ఎకరానికి 120 గ్రాములు, మొక్కజొన్న కత్తెర పురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 80గ్రాముల ఎకరాకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. అనంతరం ధాన్యం కొనుగోలు ప్రక్రియ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎ.ఒ. పూర్ణిమ, ఎఇ ఎం. నాగరాజు, విఎఎ, టిఎ వాలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.

ర్యాలీలు, సభలపై నిషేధం కుట్రలో భాగమే

డెంకాడ : ర్యాలీలు, సభలపై నిషేధం కుట్రలో భాగమేనని మాజీ ఎంపిపి, టిడిపి నాయకులు కంది చంద్రశేఖర్‌రావు అన్నారు. మండల కేంద్రంలో ఆయన మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. టిడిపి కార్యక్రమాలకు వస్తున్న స్పందనను చూసి జీర్ణించుకోలేక వైసిపి ప్రభుత్వం ఇటువంటి జిఒలను జారీ చేస్తోందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని తెలుపుతుంటామని స్పష్టం చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీ ప్రభుత్వం కొత్త రూల్ తెచ్చిందన్నారు. రోడ్లపై ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు, సభలు నిర్వహించుకోకూడదంటూ ఇచ్చే ఉత్తర్వులు గతంలో ఉంటే దేశానికి స్వాతంత్ర్యం వచ్చుండేది కాదేమోనని ఎద్దేవా చేశారు.

ట్రక్కుషీట్లు పరిశీలన

వేపాడ : మండలంలోని వల్లంపూడి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఎస్‌టిఒ పెండింగ్‌లను జె.డి త్రినాథరావు మంగళవారం పరిశీలించారు. ఈ ఏడాది 2.64లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల వద్ద నుండి సేకరించాలని నిర్ణయించామని ఇప్పటి వరకు 1.50లక్షల మెట్రిక్ టన్నులు సేకరించామని అన్నారు. సేకరించిన ధాన్యానికి సంబంధించిన సొమ్మును కూడా రైతుల ఖాతాల్లో వేస్తున్నామన్నారు. పండించే పెసర, మినుము పంటలను రక్షించుకోవడానికి క్రిమిసంహారక మందులను ముందస్తుగా పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఏ యశ్వంత్ కుమార్, వైసిపి నాయకుడు వల్లంపూడి గ్రామ వైస్ సర్పంచ్ రుద్ర వెంకట్రావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై గ్రామసభ

నెల్లిమర్ల : మండలంలోని మధుపాడలో అభివృద్ధి పనులపై మంగళవారం గ్రామ సభ జరిగింది. సర్పంచ్ నల్లం అప్పారావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి పి. సురేశ్ అధ్యక్షతన గ్రామ సచివాలయంలో అభివృద్ధి పనులపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అప్పారావు మట్లాడుతూ గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులు, ఉపాధి హామీ పనులు గుర్తించి ప్రతిపాదనలు తయారు చేయాలని, ముఖ్యంగా తాగు నీటి వనరులు, పారిశుధ్య నిర్వహణ, వీధి కుళాయిలు ఏర్పాటు, ఉపాధి హామీ పనులు గుర్తించాలని సూచించారు. అనంతరం గుర్తించిన పనులు ప్రతి పాదనలు గ్రామసభలో ప్రవేశించారు. ఈ సభలో గ్రామ పెద్దలు నల్లం శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వాడీ వేడిగా పంచాయతీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ ఎర్రయ్య రామస్వామి

కొత్తవలస : కొత్తవలస మేజర్ పంచాయతీ సమావేశం మంగళవారం ఉదయం సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి అధ్యక్షతన వాడీ వేడిగా జరిగింది. ప్రతిపక్ష వార్డు మెంబర్ గొరపల్లి రాము ప్రతి విషయంలో ప్రతి అంశంపై సభలో ప్రశ్నించారు. చీపురుపలస గ్రామంలో మంచినీటి బావి అంశంపై ఇరుపక్షాల మధ్య చర్చ జరిగింది. వార్డుల్లో అభివృద్ధి పనులు, నిర్వహించాలని పలువురు వార్డు సభ్యులు కోరారు. కొత్తవలస స్మశాన వాటిక గేటుకు ఆనుకొని ఉన్న చిరు వర్తకులు 8 మంది, శాశ్వత నిర్మాణాలు చేసుకోవడానికి అర్జీపై, సభలో చర్చ జరిగింది. ఇదే ప్రాంతంలో గతంలో తొలగించిన 19 మంది వర్తకులకు న్యాయం చేయాలని వార్డు మెంబర్ గొరపల్లి రాము సభలో కోరారు. ఈ సమావేశంలో పంచాయతీ ఉప సర్పంచ్ పెనగంటి మంగవేని, వైస్ ఎంపిపి కర్రి శ్రీను, పంచాయతీ సెక్రటరీ కన్నబాబు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ఇద్దరు ప్రతిభ

బొబ్బిలి : రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలో బొబ్బిలి పట్టణానికి చెందిన ఇద్దరు క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. డిసెంబర్ 29 నుంచి జనవరి 1 వరకు కృష్ణా జిల్లా ఆగ్గిరాలలో రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు జరిగాయి. ఈ పోటీలలో పట్టణానికి చెందిన రెడ్డి శ్రుతి సిల్వర్ మెడల్, రెడ్డి సుజన బ్రాంజ్ మెడల్ సాధించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన మంగళవారం అభినందించారు. క్రీడలలో యువత, విద్యార్థులు రాణించి బొబ్బిలి ప్రాంతానికి మంచి పేరు తేవాలని కోరారు. కార్యక్రమంలో కోచ్ సుధాకర్ ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికలు

పూసపాటిరేగ : మండలంలోని కొప్పెర్ల గురుకుల పాఠశాలలో మంగళవారం ఎస్‌జిఎఫ్ అండర్ 19, సబ్ జూనియర్స్ టెన్నికాయిట్ జిల్లాస్థాయి ఎంపికలు జరిగాయని పిఇటి సత్యనారాయణ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు అండర్ 19 విభాగంలో ఈనెల 11, 12వ తేదీల్లో ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. సబ్ జూనియర్స్ విభాగంలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 11, 12వ తేదీల్లో అనకాపల్లిలో జరుగును రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ టోర్నమెంట్‌లో పాల్గొంటారన్నారు. ఎంపికలు అండర్ 19 సెక్రెటరీ కృష్ణ, ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ రఘునాయకుడు ఆధ్వర్యంలో జరిగాయన్నారు. కొప్పెర్ల పాఠశాల విద్యార్థులకు ఉప సర్పంచ్ లంకలపల్లి రాజారావు సొంతగా క్రీడా దుస్తులను అందించారు.



శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి దొగ్గ సత్యవంతుడు

ఎస్‌డబ్ల్యుపిసి నిర్మాణానికి శంకుస్థాపన

వేపాడ : మండలంలోని అరిగి పాలెం గ్రామంలో మంగళవారం ఎంపిపి దొగ్గ సత్యవంతుడు ఎస్‌డబ్ల్యుపిసి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్ నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధుల నుండి రూ.6.5లక్షలు వెచ్చించామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దుల్ల లక్ష్మి, ఎంపిటిసి టివి రమణ, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు ఎస్ వెంకటరావు, మాజీ ఎంపిటిసి డి వెంకటరమణ, నాయకులు సన్యాసిరావు, సోంబాబు గ్రామ సర్పంచ్ ముర్రిపిండి గంగరాజు, ఎంపిటిసి అజఖ సత్యనారాయణ, నాయు శ్రీను, ఎంపిడిఒ పట్నాయక్, పంచాయతీ కార్యదర్శి యశోద తదితరులు పాల్గొన్నారు.

అలమండలో గడపగడపకు..

జామి : మండలంలోని అలమండలో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ సంకల్పమని అన్నారు. తమ ప్రభుత్వంలో అర్హులందరికీ అభివృద్ధి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గొర్లె సరోవ, మండల పార్టీ కన్వీనర్ గొర్లె రవికుమార్, అలమండ సొసైటీ ఛైర్మన్ రాజు, వైస్ ఎంపిపి గేదెల వెంకటరావు, స్థానిక సర్పంచ్ కోట పాపమ్మ, వైస్ సర్పంచ్ లగుడు దేముడు, బండారు వెంకటరావు, అప్పలనాయుడు, ఆదారి, ఆనంద్, బండారు రామకృష్ణ, కిల్లి నాయుడు బాబు, బీల వెంకటరావు, కాళ్ల చినబాబు, జన్నివలస సర్పంచ్ రెడ్డి చంద్ర నాయుడు, రామయ్య పాలెం సత్యం, లగుడు సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఆరోగ్యవంత సమాజానికి సహకరించాలి

భోగాపురం : విద్యార్థులు ఆరోగ్యవంతమైన సమాజానికి సహకరించాలని సామాజిక పరివర్తన సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయ అధికారి బి.రామకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక కెజిబివి పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులలో రక్తహీనత సమస్య ఎక్కువగా ఉందన్నారు. ఎక్కువ మంది విద్యార్థులలో స్వల్ప రక్తహీనత, కొద్ది మందిలో తీవ్ర రక్తహీనత ఉందన్నారు. రక్తహీనత వలన జ్ఞాపకశక్తి లోపించడం, వేగంగా అలసటకు గురి కావడం, ఎక్కువ సేపు పనిచేయలేకపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయన్నారు.

చదువులమ్మ సావిత్రీబాయి పూలే

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలో గల వల్లంపూడి కూడలి వద్ద చదువులమ్మ తల్లి సావిత్రిబాయి పూలే190వ జయంతిని మండల దళిత మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి మండల దళిత మహాసభ అధ్యక్షులు కొమనాపల్లి రాము ఆమె చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొమనాపల్లి ఏసుదాసు, ఆర్ సన్నీ బాబు, జి. గోపి, కె రమణ, కే నర్సింగరావు పాల్గొన్నారు. మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు వల్లి, వల్లంపూడి ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ అర్జున్‌రావు పాల్గొన్నారు.

కొత్తవలస: మండలంలో అప్పన్నదొరపాలెం, తహశీల్దార్ కార్యాలయంలో ఈశ్వర్ అప్పారావు, తహశీల్దార్ ప్రసాద్ రావు ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగ నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డిటి హర్షవర్ధిని, ఆర్ఐ నెక్కల కిషోర్, విఆర్ఒ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రి బాయ్ పూలే స్త్రీల ఆత్మగౌరవానికి ప్రతీకని బొబ్బిలి రోటరీ క్లబ్ అధ్యక్షులు నారాయనప్పవలస పాఠశాల ప్రధానోపాధ్యాయులు జెసి రాజు అన్నారు. మంగళవారం సావిత్రి బాయి పూలే జయంతిని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా రోటరీ ఆధ్వర్యంలో పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా 8వ తరగతి విద్యార్థిని హారిక వేసిన సావిత్రిభాయ్ వేషధారణ విద్యార్థులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, భానుప్రకాశ్, రామచంద్రరావు, మురళి, మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: స్థానిక ఆదిత్య పాఠశాలలో మంగళవారం సావిత్రిబాయి పూలే జయంతి



మెంటాడ : పూలే చిత్రపటానికి మాలవేసి నివాళులర్పిస్తున్న పిహెచ్‌సి సిబ్బంది

వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ చందమామ సేవా యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదిత్యా విద్యాలయం కరస్పాండెంట్ వి. సూరిబాబు, హెచ్ఎం వి.అమృత సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

శృంగవరపుకోట: సావిత్రిబాయి పూలే జయంతిని ప్రభుత్వ కళాశాలలో జాతీయ సేవా పథకం, ఉన్నత భారత్ అభియాన్ ఆధ్వర్యంలో ఘనంగా మంగళవారం నిర్వహించారు. ముందుగా ఆవిడ చిత్రపటానికి పూలమాలు లేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంఛార్జి ప్రిన్సిపాల్ ఎం.రమేష్ కుమార్, కళాశాల ఉన్నత భారత్ అభియాన్, ఎన్ఎస్ఎస్.పిఒ సంధ్యారాణి, అధ్యాపకులు భాస్కర్, ఈరన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో సావిత్రి భాయి పూలే జయంతి కార్యక్రమాన్ని స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ పెంట సత్యనారాయణ ఎస్.కోట బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని విజయలక్ష్మి, ధర్మవరం జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి. లక్ష్మిను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జివి రమణ, మండల గౌరవ అధ్యక్షులు విఎస్ దేవుడు, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎమ్ కొండల రావు, ఏ. శ్రీనివాస్, మండల సహాధ్యక్షులు ఏవి. లక్ష్మి, ఎంవిఎస్ నారాయణ, జి అరుణ కుమారి, పి స్వప్న, గూనూరు వెంకట్రావు పాల్గొన్నారు.

రామభద్రపురం: సావిత్రి బాయి జయంతి ఉత్సవాలను మంగళవారం యుటిఎఫ్ రామభద్రపురం ఆధ్వర్యంలో బుసాయవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఘనంగా నిర్వహించారు. ఎంఇఒ తిరుమల ప్రసాద్ పాల్గొని ఆమె చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ప్రసన్న కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయిలు అప్పారావు, యుటిఎఫ్ నాయకులు వెంకటరావు ఇతర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తవలస: ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పాఠశాల హెచ్ఎం బి.లక్ష్మి మహిళా ఉపాధ్యాయులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బీ.జయ, డి శ్రావణి, లావణ్య, లక్ష్మి, సఖీనా, శాంత కుమారి, అనంతలక్ష్మి, శ్రీదేవి, అప్పాయమ్మ, సూర్యకుమారి, రూప, అఖిలారాణి, ఉమా, దేవుడమ్మ, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

గుర్ల: సావిత్రిబాయి పూలే ఆశయాలకు అనుగుణంగా అందరూ నడుచుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన గుర్ల కెజిబివిలో జరిగిన సావిత్రి భాయి పూలే జయంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తొలి మహిళా సంఘ సంస్కర్త, ఉపాధ్యాయని,రచయిత్రి, ఆమె సేవలు సమాజం మారువలేనివని కొనియాడారు. విద్యార్థులు విద్యార్థి దశ నుంచి మంచి అలవాట్లును అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి సూర్యనారాయణరాజు, ఎంపిపి పొట్నూరు ప్రమీల, వైసిపి



గుర్ల: సభలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

నాయకులు పొట్నూరు సన్యాసి నాయుడు, వైస్ ఎంపిపి తిరుపతి రావు, కెజిబివి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం: మండలంలోని మరుపల్లి పిహెచ్‌సి, మెంటాడ మండలంలోని చల్లపేట పిహెచ్‌సి, దత్తిరాజేరు మండలంలోని దత్తిరాజేరు పిహెచ్‌సిల్లో సిఐటియు, ఐద్వా ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి సభలు జరిగాయి. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ సాయికృష్ణారెడ్డి, సిహెచ్ఒ ఎ. అప్పలనర్సమ్మ, ఆశాలు రమణమ్మ, రాజేశ్వరి, మెంటాడ పిహెచ్‌లో ఆశా నాయకులు సత్యవతి, లక్ష్మి, రాధాలు పాల్గొన్నారు.

బొబ్బిలి : చదువుతోనే మహిళలు అభివృద్ధి చెందుతారని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు కె.పుణ్యవతి అన్నారు. శ్రీపొట్టి శ్రీరాములు మున్సిపల్ పాఠశాలలో సావిత్రి భాయి పూలే జయంతి వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. బాలికా విద్యను ప్రోత్సహించేందుకు సావిత్రి భాయి పూలే చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ నాయకులు శివ, వాసు, రచన సమాఖ్య, మథర్ థెరిస్సా సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : సావిత్రి బాయి పూలే సేవలు మరువలేనివని జనసేన నాయకులు గురాన అయ్యలు అన్నారు. స్థానిక జి.ఎస్.ఆర్ కాంప్లెక్స్‌లో జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గురాన అయ్యలు మాట్లాడుతూ మహిళల కోసం సావిత్రిబాయి చేసిన సేవలను కొనియాడారు.

విజయనగరం కోట : గాజులరేగ నారాయణ పబ్లిక్ స్కూల్లో పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఎం.నారాయణరావు మాట్లాడుతూ నిమ్న వర్గాల ఆశాజ్యోతి సావిత్రిబాయి పూలే అన్నారు.

పింఛను రూ.3వేలు చేసిన తర్వాతే ఎన్నికలు

ప్రజాశక్తి- బొబ్బిలి

పాదయాత్ర, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం సామాజిక పింఛన్ సొమ్ము రూ.3వేలుకు పెంచిన తర్వాతే వైసిపి ఎన్నికలకు వెళ్తుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. శ్రీ కళాభారతి ఆడిటోరియంలో మంగళవారం నూతన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు, పాదయాత్రలో ప్రజలకు హామీ ఇవ్వడంతోనే సామాజిక పింఛన్ సొమ్మును రూ.2వేలు నుంచి దశల వారీగా రూ.2,750కు పెంచినట్లు చెప్పారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా టిడిపి ప్రజలను మోసం చేస్తే వైసిపి ఎన్నికల హామీలను అమలు చేసి ప్రజల విశ్వాసాన్ని పొందుతున్నట్లు చెప్పారు. బొబ్బిలిలో మూడుసార్లు రాజులు ఎమ్మెల్యేగా గెలవడంతో బొబ్బిలి అభివృద్ధికి దూరంగా ఉందన్నారు. ఎన్నికల్లో టిడిపి తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని కోరారు. ప్రజలు బాగుపడడం రాజులకు ఇష్టం వుండకపోవడం వల్లనే అభివృద్ధి చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, టిపిఆర్ఒ జగన్మోహన్ రావు, వైసిపి మండల, పట్టణ అధ్యక్షులు శంబంగి వేణుగోపాల్, ఇంటి గోపాలరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు చెలికాని మురళి, జి.రమాదేవి, ఏఎంసి వైస్ చైర్మన్ తెంటు పార్వతి, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: మేజర్ పంచాయతీ పరిధిలో గల పలు వార్డుల్లో మంగళవారం వైఎస్ఆర్ పింఛన్ల వారోత్సవాల్లో భాగంగా సర్పంచ్ సంతోషి కుమారి నూతన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజల



భోగాపురం: పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోపాడ కుమార్, ఎంపిటిసి రాజేశ్వరి, పుణ్యగిరి ట్రస్ట్ చైర్మన్ రామకృష్ణ, పంచాయతీ వార్డు సభ్యులు అప్పారావు, కన్వీనర్ అంబటి యశ్వంత్ పాల్గొన్నారు.

కొత్తవలస: శ్రీ లలిత కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కొత్త పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని 290కిపైగా కొత్త పింఛన్లు వచ్చాయన్నారు. పింఛన్ల పంపిణీలో కులం, మతం చూడటం లేదని కేవలం అర్హతే ప్రామాణికంగా పింఛన్ల పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, పిఎసిఎస్ చైర్మన్ గొరపల్లి శివ, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవీ, మండల పార్టీ అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, వైస్ ఎంపిపి కర్రి శ్రీను, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, తుమ్మికపల్లి సర్పంచ్ విరోతి కొండలరావు, నాయకులు సర్పంచులు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం : గ్రామాల్లో పచ్చ నేతలు లేనిపోని మాటలు చెప్పి తిరుగుతున్నారని ప్రజల అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా మంజూరైన 282 సామాజిక పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పచ్చ దొంగలు పల్లె బాట పడుతున్నారని వారిని తరిమి కొట్టి మళ్లీ జగన్మోహన్ రెడ్డిని సిఎంను చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి బి.పద్మావతి ఎంపిడిఒ డి.బంగారయ్య, వైసిపి కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ, వైస్.ఎంపిపిలు రావాడ బాబు, పడాల సత్యవతి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి, సుందర హరీష్, పడాల శ్రీను, సర్పంచులు, ఎంపిటిసిలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెరక ముడిదాం: మండలంలోని గొట్టపల్లి, పులిగుమ్మి, నరసయ్య పేట, సోమలింగాపురం, మెరకముడిదాం, గర్భాం, బైరిపురం గ్రామాలలో సచివాలయం కన్వీనర్లు, సర్పంచులు ఎంపిటిసిలు, వాలంటీర్లు నూతన పింఛన్లను మంగళవారం పంపిణీ చేశారు. బైరిపురం సర్పంచ్ పప్పల విజయ కుమారి, ఉప సర్పంచ్ పప్పల క్రిష్ణ మూర్తి గ్రామంలో కొత్తగా 20 పింఛన్లు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పప్పల గ్రహణేశ్వరరావు, కందుల మళ్ళి కార్జునరావు, బోర అప్పల నాయుడు, వైస్ ఎంపిపి కందుల పార్వతి పాల్గొన్నారు.

బొప్పడాంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని బొప్పడాం జిల్లా పరిషత్తు పాఠశాలలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ నేత్ర వైద్య శిబిరం నెల్లిమర్ల, గుర్ల మండలాలకు చెందిన శ్రీ చౌడేశ్వరి దేవి దేవాంగుల సంఘం ఆధ్వర్యంలో స్వామి కంటి ఆసుపత్రి వైద్యులు మంచు కుమారస్వామి సౌజన్యంతో నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి వల్లూరు, బుచ్చన్నపేట, పెదతరిమి, చిన్నతరిమి, గ్రామస్తులు సుమారుగా 250 మంది వరకు ఒపి ద్వారా తనిఖీలు చేయించుకున్నారని నిర్వహకులు తెలిపారు. తనిఖీలు చేయించుకున్న వారిలో 45 మంది వరకు ఆపరేషన్ అవసరం పడుతుందని వైద్యులు తెలిపారు. ఈ సంధర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ కుమార్ స్వామి మాట్లాడుతూ ఈ శిబిరంలో తనిఖీలు చేయించుకుని అవసరమైన ప్రతి ఒక్కరికి ఉచితంగా ఆపరేషన్లు చేసి, ఉచితంగా మందులు అందజేస్తామని, ఆపరేషన్లు చేయించుకున్న వారికి విజయనగరం నుంచి వారి స్వస్థలాలకు వచ్చి, వెళ్లిన రెండు వైపులా రవాణా చార్జీలు కూడా అందజేస్తామని ఆయన తెలిపారు. కంటి విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా షుగర్ ఉన్న వ్యక్తులు తరచుగా కంటి



మాట్లాడుతున్న డాక్టర్ కుమార్ స్వామి

పరీక్షలు చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చౌడేశ్వరి దేవి సంఘ అధ్యక్ష, కార్యదర్శులు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మావూరి శంకర్రావు, రిటైర్డ్ హెచ్ఎం నల్ల సోమరాజు, బొప్పడాం జెడ్‌పి హైస్కూల్ హెచ్ఎం ఎం. నగేష్ కుమార్, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ బొమ్మన రామారావు, బిల్డర్ ఆల్తి శ్రీనివాసరావు, సర్పంచ్ అంబల్ల కిరణ్ కుమార్, ఎంపిటిసి బొంతు పురుషోత్తమనాయుడు, మాజీ సర్పంచ్ బొంతు శంకర్రావు, గ్రామ దేవాంగ సంఘ సభ్యులు అల్లాడ వెంకటరమణ, తూట సురేష్, దొంతం భద్రయ్య, అల్లాడ శంకర్రావు, దొంతం వీర్రాజు, తూట అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

'వైసిపి కర్మను వదిలించుకోవాలి'

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రాష్ట్రానికి పట్టిన వైసిపి కర్మను వదిలించుకోవాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్రోతు బంగార్రాజు పిలుపునిచ్చారు. మంగళ వారం నగర పంచాయతి పరిధి జరజాపుపేట 18వ వార్డులో టిడిపి పట్టణ అధ్యక్షులు బైరెడ్డి లీలావతి ఆధ్వర్యంలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా రాష్ట్ర కార్యదర్శి కర్రోతు బంగార్రాజు, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, పట్టణ టిడిపి అధ్యక్షులు బైరెడ్డి లీలావతి మాట్లాడుతూ అధికారం చేపట్టి అభివృద్ధి పనులు చేయక వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు. విపరీతంగా నిత్యావసర వస్తువుల ధరలు పెరిగడం, విద్యుత్, బస్ ఛార్జీలు పెంచి అధికార వైసిపి ప్రజలను దోచుకు తింటుందని విమర్శించారు. పండించిన పంటలకు గిట్టబాటు ధర కల్పించలేదని, గృహ నిర్మాణాల్లో అక్రమాలు, సంక్షేమ పథకాల్లో కోత విధించి అర్హులకు మొండి చేయి



జరజాపుపేటలో ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

చూపిస్తుందన్నారు. అన్ని రంగాల్లో అధికార వైసిపి విఫలమైందని, రాష్ట్రానికి పట్టిన కర్మను వచ్చే ఎన్నికల్లో వదిలించుకోవడానికి ప్రజలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు, 18వ వార్డు టిడిపి నాయకులు కాళ్ళ రాజ శేఖర్, యువ నాయకులు అట్టాడ శ్రీధర్, నాయకులు పతివాడ అప్పల నాయుడు, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పతివాడ తారాక రామా నాయుడు, నడిపేన నారాయణ రావు, కిల్లంపల్లి కృష్ణా రావు, బొలే కృష్ణమూర్తి, కాళ్ళ సూర్య నారాయణ, మాత గోపి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం

ప్రజాశక్తి - జామి

ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి, పండగ లోపు 80శాతం పూర్తి అయ్యేలా చూడాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి త్రినాథ స్వామి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం చింతాడ గ్రామంలో పర్యటించారు. వరి మాగాణిలో అపరాల పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా త్రినాథ స్వామి మాట్లాడుతూ, ధాన్యం రవాణా, గోనె సంచులు సమ కూర్చుకుంటే, తొందరగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా తీసుకోవటానికి వీలు అవుతుందని, వాటికీ సంబంధించిన సొమ్ము కూడా రైతు ఖాతాలో జమ చేస్తారని తెలియజేశారు. అపరాలు మద్దతు ధర కూడా ప్రభుత్వం పెంచింది కనుక మెలకువలు పాటించి సాగు చేస్తే 3-5 క్వింటాలు వరకూ దిగుబడి సాధించవచ్చు అని చెప్పారు. పంట మార్పిడిలో భాగంగా వరి తరువాత అపరాలు, మొక్క జొన్న, రాగి, నువ్వులు పంటలు సాగు చేస్తే తక్కువ మధుపుతో ఎక్కువ ఆదాయం పొందవచ్చని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు స్వాతి, కిరణ్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.



పెసరపెంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

క్రికెట్ పోటీలు ప్రారంభం

డెంకాడ : నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తనయులు మణిదీప్ నాయుడు, ప్రదీప్ నాయుడు, పిఎసిఎస్ చైర్మన్ రొంగలి కనకసింహాచలం కలిసి మంగళవారం మండల కేంద్రంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. నియోజకవర్గం స్థాయిలో నిర్వహించే ఈ క్రికెట్ పోటీల్లో మొదటి బహుమతిగా రూ.20వేలు, రెండో బహుమతిగా రూ.10వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. దీంతో పాటు ఉత్తమ బ్యాట్స్‌మెన్, ఉత్తమ బౌలర్‌కు రూ.4వేల చొప్పున, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌కు రూ.6వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో ఇటువంటి పోటీలను నిర్వహించడం గొప్ప విషయమన్నారు.



డెంకాడ: పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

భోగాపురం: యువతలో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే క్రీడలను నిర్వహిస్తున్నామని జనసేన నాయకులు లోకం నాగమాధవి అన్నారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో మిరాకిల్ మైదానంలో క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం ప్రారంభించారు. నియోజకవర్గం నుండి 22 జట్లు పాల్గొన్నాయి. విజేతగా నిలిచిన జట్టుకు ట్రోఫీతో పాటు ప్రథమ బహుమతిగా రూ. 50వేలు, ద్వితీయ బహుమతి రూ. 30 వేలు, తృతీయ బహుమతి రూ. 20 వేలు ఇస్తామన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

వేపాడ : మండలంలో కొత్తగా మంజూరైన సామాజిక పింఛన్లను స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చేతుల మీదుగా మండల కేంద్రంలోని చెరువు కాటా వద్ద బుధవారం పంపిణీ చేస్తారని ఎంపిడిఒ పట్నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు జరగనున్న ఈ కార్యక్రమానికి మండల స్థాయి ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపిటిసిలు హాజరు కావాలని ఆయన కోరారు.

వాలంటీర్ల ఔదార్యం

గుర్ల : మండలంలో భూపాలపురం గ్రామానికి చెందిన వాలంటీర్‌లు ఎస్.నారాయణరావు, ఎస్ రాము నాయుడులు తమ ఔదార్యం చాటుకున్నారు. తమ పరిధిలో ఉన్న ఫించన్ లబ్దిదారులు కొరడా అప్పల నాయుడు, ఉప్పల సత్యవతి అనారోగ్యంతో విశాఖ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకుని అక్కడకు వెళ్లి మంగళవారం ఫించన్లను అందచేశారు. ఫింఛన్ దారులకు సకాలంలో ఫించన్లు అందచేసినందుకు జెడ్‌పిటిసి శీర అప్పల నాయుడు వాలంటీర్లను అభినందించారు.



రోగికి పింఛన్ డబ్బును అందిస్తున్న వాలంటీర్లు

నైపుణ్యాభివృద్ధి శిక్షణతో ఉద్యోగాల్లో స్థిరపడాలి

ప్రజాశక్తి-విజయనగరం

యువత నైపుణ్యాభివృద్ధి శిక్షణలతో ప్రతి ఒక్కరూ ఉద్యోగంలో స్థిరపడాలని స్కిల్ ట్రైనింగ్ అండ్ జాబ్ ఫెయిర్ ప్రభుత్వ సలహాదారు గాది శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. సీడాప్, ఎపిఎస్ఎస్‌డిసి ఎమ్‌డి అండ్ సిఇఒ ఎస్.సత్యనారాయణతో కలసి జిల్లాలో మంగళవారం పర్యటించారు. అందులో భాగంగా సీడాప్ స్కిల్ కాలేజిని ప్రారంభించి యువతకు యాజమాన్యానికి పలు సూచనలు అందజేశారు. టిటిడిసిలో సీడాప్ రిటైల్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో శిక్షణ పొందుతున్న యువతకు స్వాగత కిట్లను అందజేశారు. అనంతరం ఎస్ఎంఒ, ఆర్ఎస్ఇటిఐ సెంటర్లను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ మహిళ ఐటిఐ కళాశాలలో ఎపిఎస్ఎస్‌డిసి స్కిల్ హబ్ లను సందర్శించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీడాప్ జెడిఎం, ఎపిఎస్ఎస్‌డిసి డిఎస్‌డిఒ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ధ్యేయం

పూసపాటిరేగ : గ్రామాభివృద్ధే తమ ధ్యేయమని వెంపడాం సర్పంచ్ పిన్నింటి కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని వెంపడాంలో పంచాయతీ కార్యాలయం వద్ద కార్యదర్శి టి. రామకృష్ణ ఆధ్వర్యంలో పంచాయతి గ్రామాభివృద్ధి ప్రణాళికా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. అర్హులందరికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామన్నారు. ప్రజలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలుపై సచివాలయ ఉద్యోగులు కృషి చేయాలన్నారు.